# దయ్యాల భవంతులు



బులుసు-జీ-ప్రకాష్

ఇల్లు అమ్మేసి, యింటిమీద చేసిన అప్పు యాభై వేలు తీర్చేసి, మిగిలిన యాభై వేలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో పడేసి దాని మీద వచ్చే వడ్డీతో కాలక్షేపం చేసెద్దామని తలంపు కలిగింది శేషతల్పానికి.

'ఇల్లు అమ్మబడును' అనే అట్ట బోర్డును తగిలించిన మర్నాటి నుంచీ స్థానిక వర్తక ప్రముఖులు కొందరు యిల్లు చూసుకొని బేరసారాలు మొదలు పెట్టారు.

పక్కింటి పండరినాధానికి శేషతల్పం గారి యింటిమీద కన్నుపడ్డాది. డెబ్బయి వేలు యిస్తానని, తనకే ఆ యిల్లు అమ్మేయమని పట్టుపట్టారు. ఎట్టి పరిస్థితు




ల్లోను లక్షకి తగ్గనన్నాడు శేషతల్పం.

వీడికి యిదికాదురా మందు అంటూ ఒక పథకం వేశాడు పండరినాథం. ఎవరైనా యిల్లు కొనడానికి సిద్ధపడితే ఆ కొంపలో దయ్యాలు భూతాలు మసలుతున్నాయని, ఆ యిల్లు ఎవరు కొన్నా మూడునెలలు తిరక్కుండానే ఆ కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు రక్తం కక్కుకు ఛస్తారని ప్రచారం మొదలెట్టాడు.

ఈ దుష్ 'ప్రచారరథా'నికి సారధ్యం వహించవలసిందిగా తన దగ్గర ప్రయివేటు చదువుతున్న ఓ బాలుణ్ని నియమించాడు.

ఎవరైనా యిల్లు చూద్దామని వస్తే చాలు- పండరినాథంగారి దుష్ప్రచార సారథి, వాళ్ళని కలసి, ఆ యిల్లు కొన్నారంటే ఏ విషపరిణామాలు సంభవిస్తాయో ఏ కరువూ లేకుండా ఏకరువు పెట్టేవాడు.

దాంతో యిల్లు కొనడానికి వచ్చిన వాళ్ళకి కంపరం పుట్టుకొచ్చేది.

పాపం శేషతల్పం విచార వల్మీకంలో దూరిపోయాడు. ఓ పక్క అప్పుల స్వాములు, వేరొక పక్క వడ్డీకాముల వాళ్లు పీకి పాకం చేసేస్తున్నారు.

ఇంతలో ఓ శుభోదయాన- 'మీ యిల్లు కొనడానికి నే సిద్ధమే'నంటూ ఓ వడివయస్కుడైన గృహస్థు ముందుకు వచ్చారు. శేషతల్పం దాపరికం లేకుండా, పొరుగింటి పండరినాథం, తన యిల్లు కొనేవాళ్ళకి ఏ విధంగా అడ్డంకులు కల్పిస్తున్నాడో వివరించాడు.

అయినా నేను మీ యిల్లుకొనే తీర్తానని మాట యిచ్చాడా పెద్దమనిషి.

శేషతల్పం మహదానందం పొందేడు.

రిజిస్ట్రీ అయిపోయిన్నాడే శేషతల్పం యిల్లు ఖాళీచేసి, యిల్లు కొన్న పెద్దమనిషికి తాళం అప్పజెప్పాడు.

కొన్నాళ్ళకి ఓ లారీనిండా సామాను వేసుకుని ఆ యింట్లో దిగిపోయాడు ఆ పెద్దమనిషి.

పొరుగునే వున్న పండరినాథం ఆ భూతగృహాన్ని కొన్న పెద్దమనిషిని కలిసి- "అయ్యా! నన్ను పండరినాథం అంటారు. ఈ యిల్లు కొన్నది మీరేనా!"

అని పలకరించాడు.

"రాన్నివే! లోపలికి రండి" అని సాదరంగా స్వాగతం చెప్పేడు యిల్లు కొన్న గృహస్థు.

"పాపం మీకు తెలిసినట్టు లేదు. ఈ యింట్లో దయ్యాలు భూతాలు యింటి దూలాల్ని, చూరుల్ని పట్టుకుని వేలాడుతున్నాయి. యింట్లో దిగినవాళ్ళ కుటుంబ సభ్యులకి ఏవేవో రోగాలు వచ్చి, మూడు నెలల్లో రక్తం కక్కుకు చస్తారని చెప్పడానికి నేనెంతో చింతిస్తున్నాను" అన్నాడు దీనంగా పండరినాథం.

"అయ్యా! పండరినాథంగారూ! మానవుడి శరీరం గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశము అనే పంచభూతాలతో నిండి వుంది. అందుకే దీన్ని పాంచభౌతిక శరీరం అన్నారు.

ఇహ దయ్యాలంటారా? దైవం అనే పదానికి వికృతి దయ్యము. అంటే ఈ యింట్లో అనేకమైన దైవాలు ఉన్నారన్న మాట!

-ముక్కోటి దేవతలు, మానవ జీవనానికి అవసరమయ్యే పంచభూతాలూ వున్న ఈ యింట్లో ఎవ్వరికీ ఏ లోటూ రాకూడదు. రాదు కూడాను!" అని నొక్కి వక్కాణించాడు ఆ గృహస్థు.

పాపం పండరినాథం ఖంగు తిన్నాడు!

●●●


